# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
22-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 4

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# కోమటిరెడ్డి సైడ్ అయ్యారా?




# సైడ్ చేశారా?

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసంతృప్తితో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీ ఆయనను సైడ్ చేస్తుందా? లేకుంటే ఆయనే సైడ్ అవుతున్నారా? మొన్నటి గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం లో ఆయన ఎందుకు కనిపించలేదు? హైదరాబాదులో అందుబాటులో ఉన్న ఎందుకు హాజరు కాలేదు? ప్రోటోకాల్ ప్రకారం సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్న ఆయన కార్యక్రమానికి ఎందుకు రాలేదు? తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది.

### గద్దర్ అవార్డుల ప్రదానోత్సవానికి గైర్హాజరు

### హైదరాబాదులో ఉండి కూడా ముఖం చాటేసిన సినిమాటోగ్రఫీ మంత్రి

### డిప్యూటీ సీఎం హవా నచ్చకే?

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఉగాది నాడు రవీంద్రభారతిలో గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు హాజరయ్యారు. కానీ ప్రోటోకాల్ ప్రకారం సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కాకపోవడం మాత్రం కొత్త చర్చకు దారితీస్తోంది.

స్థానికంగా ఉన్నా..

హైదరాబాదులో అందుబాటులో ఉండి కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కాకపోవడం పై అనేక రకాల చర్చ నడుస్తోంది. ఆహ్వాన పత్రిక విషయంలో తన ప్రాధాన్యత తగ్గించడం పైనే ఆయన అసంతృప్తికి గురైనట్లు ప్రచారం నడుస్తోంది. సినిమాటోగ్రఫీ మంత్రిగా ముఖ్య అతిథిగా తన పేరు ఉండాల్సిన చోట.. కేవలం అతిథిగా మార్చడం పైనే ఆయన అసంతృప్తికి లోనట్టు సమాచారం. పైగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు

- మిగతా 2వ పేజీలో

# బెంగాల్ ఎన్నికల ప్రచారానికి చంద్రబాబు!



### బిజెపి ప్రత్యేక ఆహ్వానం

### మమతా బెనర్జీ హవాకు చెక్

### వ్యూహాత్మకంగా కేంద్ర పెద్దలు

మే నెలలో దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఇందులో నేరుగా పశ్చిమ బెంగాల్లో అధికారంలోకి రావాలనుకుంటోంది భారతీయ జనతా పార్టీ. ఇప్పటికే అస్సాంలో అధికారంలో ఉండగా దానిని నిలబెట్టుకోవాలని చూస్తోంది. మిగతా చోట్ల మాత్రం మిత్రులతో బరిలో దిగుతోంది.





**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీకి పశ్చిమ బెంగాల్ అత్యంత కీలకం. అక్కడ మమతా బెనర్జీని ఓడించకపోతే దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఇండియా కూటమి పట్టు బిగించే ఛాన్స్ ఉంటుంది. అందుకే అక్కడ సర్వశక్తులు ఒడ్డుతోంది భారతీయ జనతా పార్టీ.

**అప్పట్లో సాధ్యం కాలే..**

గతంలో రెండు సార్లు అధికారం చేపట్టారు మమతా బెనర్జీ. 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనే మమతా బెనర్జీని ఓడించాలని భారతీయ జనతా పార్టీ గట్టి ప్రయత్నం చేసింది. కానీ దానిని తట్టుకొని నిలబడగలిగారు మమతా బెనర్జీ. బిజెపిని సవాల్ చేసి తన అధికారాన్ని నిలబెట్టుకున్నారు.

- మిగతా 2వ పేజీలో

# రేవంత్ కోర్టులో జీవన్ రెడ్డి బంతి!

### కాంగ్రెస్ దూతల విస్తృత చర్చలు

### ఆ ఒక్కటి పై పట్టుబడుతున్న అసంతృప్త నేత

కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మెత్తబడతారా? ఆ ఛాన్స్ ఉందా? కాంగ్రెస్ దూతలతో ఆయన ఏం చెప్పారు? కాంగ్రెస్ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకోనుంది? జీవన్ రెడ్డికి భరోసా ఇస్తుందా? లేకుంటే వదులుకునేందుకు సిద్ధపడుతుందా? పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది.



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఎట్టి పరిస్థితుల్లో జీవన్ రెడ్డిని వదులుకోకూడదని భావిస్తే మాత్రం పరిణామాలు ఇంకోలా ఉంటాయి. వదులుకోవాలని సిద్ధపడితే మాత్రం ఆయనను పట్టించుకునే ఛాన్స్ ఉండదు.

- మిగతా 2వ పేజీలో



# రోహిత్ రెడ్డి ఫాంహౌస్ సీజ్!

### డ్రగ్స్ కేసుతో అధికారుల నిర్ణయం

- అసైన్డ్ భూమిలో ఫాంహౌస్ నిర్మాణం
- డ్రగ్స్ సప్లయర్ అభిషేక్ సింగ్ అరెస్ట్!
- పలుమార్లు డ్రగ్స్ సరఫరా చేసిన అభిషేక్
- సిట్ అధికారుల విచారణలో వెల్లడి

- మిగతా 2వ పేజీలో

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం

### భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు

### రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సిఎం

### సిఎం రాకతో నర్మెట్టలో భారీగా బందోబస్తు..ఏర్పాట్లు

సిద్దిపేట,మార్చి21(ఆర్ఎన్ఎ): సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన

- మిగతా 3వ పేజీలో





# ఏపీ మంత్రివర్గంలోకి ఆ ముగ్గురు మహిళలు!

### రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పంచుమర్తి అనురాధలకు ఛాన్స్

2లో



**క్రైమ్ మిర్రర్, ఆంధ్రప్రదేశ్ బ్యూరో :** ఏపీలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో నడుస్తోంది. ప్రధానంగా ఈసారి మహిళలకు మంత్రి పదవులు ఇస్తారని ఒక టాక్ ఉంది. ఇప్పటికే మంత్రివర్గంలో

# సైబర్ వలలో మాజీ డీజీపీ మనుమరాలు

### రూ.1.20 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

### వాట్సాప్ డీపీతో అకౌంటెంట్‌కు మోసం

ఓ మాజీ డీజీపీ మనుమరాలికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఆమె అకౌంటెంట్‌ను బురిడీ కొట్టించి రూ.1.20 కోట్లు కాజేశారు.



3లో

# కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు

### కుళ్లిన గుడ్లతో ఎగ్‌పఫ్స్ తయారీ

### పాతపబస్తీ కుల్సుంపురాలో అధికారుల దాడి

### అక్రమంగా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్, క్రైమ్ మిర్రర్:** హైదరాబాద్ లోని కుల్సుంపురా ప్రాంతంలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు



## మరో వివాదంతో

# గరికపాటి!

### ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పై అనుచిత వ్యాఖ్యలు

### ఉపాధ్యాయుల విధులపై కూడా కామెంట్స్

### ప్రవచన కర్త పై ముప్పేట ఇప్పుడు దాడి

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలుగు ప్రవచన కర్తల్లో గరికపాటి నరసింహారావు ఒకరు. ఆయన ప్రవచనం ఇట్టే ఆకట్టుకుంటుంది. ఏ అంశంపై నైనా అనర్గళంగా మాట్లాడే పాండిత్యం ఆయన సొంతం. టీవీల్లో చూసినా ఆయనే.. ఏ ఇంట చూసినా ఆయనే.. సోషల్ మీడియాలో నైనా ఆయనే.. అంతలా ప్రాచుర్యం పొందారు



## కోమటిరెడ్డి సైడ్ అయ్యారా?
# సైడ్ చేశారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యం ఇవ్వడంపై కూడా ఆయన ఆవేదనతో ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. ఇటీవల సినీ వ్యవహారాలన్నీ డిప్యూటీ సీఎం చాంబర్ నుంచి జరుగుతుండడం పై కూడా ఆయన ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు తనకంటే ఎక్కువగా డిప్యూటీ సీఎంనే సంప్రదిస్తుండడంపై కూడా కోమటిరెడ్డి కీనుక వహించినట్లు తెలుస్తోంది. కేవలం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన శాఖ విషయంలో మితిమీరిన జోక్యం చేసుకోవడానికి తట్టుకోలేక కార్యక్రమానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది.

### సీనియర్ మోస్ట్ లీడర్..

కాంగ్రెస్ పార్టీలో అత్యంత సీనియర్ మోస్ట్ లీడర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి. ఉమ్మడి నల్గొండలో మంచి పట్టున్న నాయకుడు కూడా. అయితే అటువంటి నేతను కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే నిర్వీర్యం చేస్తోందన్న టాక్ వినిపిస్తోంది. గడిచిన మూడేళ్ల కాలంలో వెంకటరెడ్డి చుట్టూ అనేక రకాల వివాదాలు చుట్టుముట్టాయి. మొన్న మధ్యన ఓ మహిళ అధికారిని విషయంలో సైతం తప్పుడు ప్రచారం చేశారు. ఆ సమయంలో చాలా బాధపడ్డారు వెంకట్ రెడ్డి. ఇక రాజకీయాలు చేయను అన్నంత స్థితికి వచ్చేసారు. అయితే డిప్యూటీ సీఎం పార్టీ విక్రమార్కతో ఆయనకు కోల్డ్ వార్ జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. తన రాజకీయ ప్రత్యర్థులతో సన్నిహితంగా మెలుగుతున్నారన్న ఆవేదన కూడా ఉంది. మరోవైపు త్వరలో మంత్రివర్గ విస్తరణలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి పదవి తొలగిస్తారు అన్న ప్రచారం కూడా తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఉంది. ఈ కారణాలతోనే ఆయన అసంతృప్తితో ఉన్నారని.. అందుకే తన సొంత శాఖలో జరిగిన కార్యక్రమానికి హాజరు కాలేదని ప్రచారంలో ఉంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఏపీ మంత్రివర్గంలోకి ఆ ముగ్గురు మహిళలు!

(మొదటి పేజీ తరువాయి)

ఓ ముగ్గురు మహిళా మంత్రులు ఉన్నారు. వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, సవిత మంత్రులుగా కొనసాగుతున్నారు. అయితే విస్తరణలో మరికొందరు మహిళా ఎమ్మెల్యేలు మంత్రి పదవులు కోరుకుంటున్నారు. అయితే ఉన్న ముగ్గురిని తొలగించి కొత్త వారికి ఇస్తారా? లేకుంటే పాతవారిని కొనసాగిస్తూ కొత్తవారిని తీసుకుంటారా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రధానంగా ఏపీ నుంచి ఓ ముగ్గురు మహిళ నేతలు మంత్రి పదవుల రేసులో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

### రెడ్డప్ప గారి మాధవి రెడ్డి..

కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి మంత్రి పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈమె దూకుడు కలిగిన నేత కూడా. తొలిసారిగా కడప అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మొన్నటి ఎన్నికల్లో గెలిచారు. ఆమెతో పాటు భర్త రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి సైతం దూకుడు కలిగిన నాయకుడు. వీరి చొరవతోనే కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్న టాక్ ఉంది. ఐదేళ్ల వైసిపి పాలనలో గట్టిగానే నిలబడ్డారు ఈ దంపతులు. రెడ్డప్ప గారి మాధవి రెడ్డి దూకుడుగా ఉంటారని పేరు ఉంది. పైగా ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు సాధించారు. అందుకే ఆమెకు మంత్రి పదవి ఇస్తారన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో బలంగా నడుస్తోంది.

### వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి..

మరోవైపు నెల్లూరు జిల్లాకు చెందిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది మంత్రి పదవికి. మొన్నటి ఎన్నికల్లో ఆమె కోవూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. టీటీడీ ట్రస్ట్ బోర్డులో ఆమె సభ్యురాలు కూడా. ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు ఎంపీగా మొన్నటి ఎన్నికల్లో గెలిచారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఈ ఇద్దరు దంపతులు ఎన్నికలకు ముందు టిడిపిలో చేరారు. వీరి చేరికతోనే నెల్లూరు జిల్లాలో టిడిపి బలపడిందన్న టాక్ ఉంది. అందుకే మంత్రివర్గ విస్తరణలో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి మంత్రి పదవి ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది.

### పంచుమర్తి అనురాధ..

మరోవైపు శాసనమండలి సభ్యురాలు పంచుమర్తి అనురాధ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన అనురాధ మంచి వాగ్దాటి కలిగిన మహిళ నేతగా గుర్తింపు ఉంది. ప్రతికూల పరిస్థితుల నడుమ అప్పట్లో ఎమ్మెల్సీగా గెలిచారు. గెలిచిన తర్వాత పార్టీ వాయిస్ను బలంగా వినిపిస్తూ వచ్చారు. వైసిపి హయాంలో మంగళగిరి టిడిపి ఇన్చార్జిగా నియోజకవర్గ బాధ్యతలను సమన్వయం చేసుకునేవారు. మొన్నటి ఎన్నికల్లో మంగళగిరి నుంచి లోకేష్ గెలవడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. పైగా నాయకత్వానికి విధేయతగా ఉంటారన్న పేరు ఉంది. అయితే ఈ ముగ్గురికి మంత్రి పదవులు ఖాయమని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# రోహిత్ రెడ్డి ఫాంహౌస్ సీజ్!

మొయినాబాద్‌లో డ్రగ్స్ పార్టీ నిర్వహించిన తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌ను సీజ్ రెవెన్యూ అధికారులు సీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 14న ఈ ఫాంహౌస్ లో డ్రగ్స్ పార్టీ నిర్వహించి రోహిత్ రెడ్డితోపాటు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తదితరులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ విషయం తెలిసిందే. అయితే ఈ కేసు విచారణకుగాను ప్రభుత్వం నిర్వహించిన సిట్ బృందం దర్యాప్తులో అనేక సంచలన విషయాలు బయటపడినట్లు సమాచారం. రోహిత్ రెడ్డి ఫాంహౌస్ లో డ్రగ్స్ పార్టీ చేసుకోవడం ఇదే మొదటిసారి కాదని, గతంలోనూ చాలాసార్లు ఇలాంటి పార్టీలు జరిగాయని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన ఎపిసోడ్ కు కూడా ఇదే ఫాంహౌస్ వేదికైన విషయం తెలిసిందే. ఇక ఇటీవల జరిగిన డ్రగ్స్ పార్టీలో 11 మంది నిందితులు పట్టుబడటంతోపాటు పోలీసులపైకి తుపాకీతో కాల్పులు కూడా జరిపారు. దీంతో రోహిత్ రెడ్డి ఫాంహౌస్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న అభిప్రాయానికి పోలీసులు వచ్చారు. పైగా ఈ ఫాంహౌస్ నిర్మాణం అసైన్డ్ భూమిలో జరిపారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. ప్రభుత్వం



కొన్ని దశాబ్దాల క్రితం ఓ వ్యక్తికి అసైన్డ్ భూమిని ఇవ్వగా.. ఆయన నుంచి రోహిత్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి ఫాంహౌస్ కట్టారని అంటున్నారు.

### పోలీసుల అదుపులో అభిషేక్ సింగ్

మొయినాబాద్ ఫాంహౌస్ లో పట్టుబడ్డ నిందితులకు డ్రగ్స్ సరఫరా చేసిన సప్లయర్ అభిషేక్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి స్నేహితుడు కౌశిక్ రవి.. డ్రగ్స్‌ను తానే సిమ్లా నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొచ్చినట్లు ఇంతకుముందు చెప్పాడు. అయితే తరువాత జరిగిన విచారణలో ఈ డ్రగ్స్‌ను హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి కొనుగోలు చేసినట్లు బయటపడింది. డ్రగ్స్ పార్టీ జరిగిన రోజు రోహితరెడ్డి డ్రైవర్ శరత్ ఔటర్ రింగురోడ్డు సమీపంలో అభిషేక్ సింగ్‌ను కలిసి డ్రగ్స్ తీసుకొచ్చినట్లు తేలింది. ఇప్పటికి 24 సార్లు రోహితరెడ్డి ఫాంహౌస్‌లో జరిగిన పార్టీలకు డ్రగ్స్ సరఫరా చేసినట్లు నిర్ధారణ అయింది. ప్రస్తుతం సిట్‌తోపాటు ఎస్వోటీ బృందం కూడా అభిషేక్ సింగ్ నుంచి సమాచారం రాబడుతున్నట్లు, ఇతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా కొన్ని టీమ్‌లు విచారణ నిమిత్తం పలు ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిసింది. కాల్పులు, డ్రగ్స్ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితుడు రోహితరెడ్డితోపాటు రితీశ్ రెడ్డి, నమిత శర్మల కస్టడీ కోరుతూ పోలీసులు వేసిన పిటిషనపై ఉప్పరిపల్లి కోర్టు సోమవారం తీర్పు వెలువరించనుంది. ఈ పిటిషనపై గత బుధవారం వాదనలు జరగగా.. తీర్పును కోర్టు రిజర్వు చేసింది.

# బెంగాల్ ఎన్నికల ప్రచారానికి చంద్రబాబు!

అయితే గత అనుభవాల దృష్ట్యా భారతీయ జనతా పార్టీ ఈసారి ముందే మేల్కొంది. సువెందు అధికారి ద్వారా దూకుడుగా వ్యవహరిస్తోంది. మమతా బెనర్జీ సైతం అదే స్థాయి దూకుడు కనబరుస్తున్నారు. దీంతో పశ్చిమ బెంగాల్లో రాజకీయ వాతావరణం మరింత పతాక స్థాయికి చేరింది. అయితే సర్వేలన్నీ మమతా బెనర్జీకి అనుకూలంగా ఉన్నాయి. ఇది ఎంత మాత్రం భారతీయ జనతా పార్టీకి మింగుడు పడడం లేదు.

### దేశ రాజకీయాలపై ప్రభావం..

ఒక్క పశ్చిమ బెంగాల్లో ఇప్పుడు బిజెపి ఓడి మమతా బెనర్జీ గెలిస్తే దేశ రాజకీయాల్లో మార్పులు రావడం ఖాయం. అదే జరిగితే బిజెపికి ఇబ్బందికర పరిస్థితులు కూడా ఎదురవుతాయి. అందుకే బెంగాల్ విషయంలో ప్రత్యేక వ్యూహరచన చేస్తోంది బిజెపి. ప్రధానంగా ఏపీ సీఎం చంద్రబాబును ప్రచారం చేయించడం ద్వారా మమతా బెనర్జీకి చెక్ చెప్పాలని చూస్తోంది. అందుకే బెంగాల్లో ఎన్నికల ప్రచారానికి చంద్రబాబును ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. మూడు రోజులపాటు ఎన్నికల ప్రచారానికి రావాల్సిందిగా ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు సమాచారం. దీనికి చంద్రబాబు సైతం సానుకూలంగా ఉన్నట్టు పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

### ఒకప్పటి స్నేహంతో..

చంద్రబాబుతో రాజకీయంగా సన్నిహితంగా మెలిగారు మమతా బెనర్జీ. ఎన్డీఏ నుంచి చంద్రబాబు బయటకు వచ్చిన తర్వాత మమతా బెనర్జీ తో కలిసి బిజెపిని ఓడించేందుకు గట్టి ప్రయత్నాలు ఇచ్చేశారు చంద్రబాబు. అయితే ఆ ప్రయత్నం విఫలం కావడంతో తిరిగి బిజెపితోనే స్నేహం చేసి అధికారంలోకి రాగలిగారు. అయితే ఇప్పుడు అదే చంద్రబాబు ద్వారా మమతా బెనర్జీకి చెప్పాలని చూస్తోంది బిజెపి. వాస్తవానికి పశ్చిమ బెంగాల్లో తెలుగు ప్రజలు కూడా అధికంగా ఉన్నారు. చాలా నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేయగలరు. అందుకే చంద్రబాబుకు బిజెపి ప్రత్యేక ఆహ్వానం పంపగా ఆయన ప్రచారానికి వచ్చేందుకు ఒప్పుకున్నట్లు సమాచారం. చూడాలి మరి బెంగాల్లో రాజకీయం ఎటువైపు మొగ్గు చూపుతుందో.

# రేవంత్ కోర్టులో జీవన్ రెడ్డి బంతి!



(మొదటి పేజీ తరువాయి)

కానీ మంత్రి శ్రీధర్ బాబు లాంటి వారిని పంపించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఆయనను ఇంకా పార్టీలోనే కొనసాగించాలని భావిస్తోంది. అయితే జీవన్ రెడ్డి కోరికను మాత్రం మన్నిస్తేనే ఆయన పార్టీలో కొనసాగుతారు. అంటే గులాబీ పార్టీ ఎమ్మెల్యే సంజయ్ ను వదులుకుంటారా? ఆయన కంటే జీవన్ రెడ్డికి ప్రాధాన్యం ఇస్తారా? అన్నది చూడాలి.

### చంద్రబాబు మాదిరిగానే..

రాజకీయంగా రేవంత్ రెడ్డి చంద్రబాబుకు శిష్యుడు. అత్యంత సన్నిహితుడు కూడా. చంద్రబాబు మాదిరిగానే వ్యూహాలు రచించగలడు. ఇప్పుడు జీవన్ రెడ్డి విషయంలో రేవంత్ శైలి అలానే ఉంది. ఎవరైనా టిడిపి నుంచి బయటకు వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉంటే చంద్రబాబు తన దూతలను పంపిస్తారు. సమగ్రంగా వివరాలు సేకరిస్తారు. అవతలి వ్యక్తి డిమాండ్లు బాగుంటే అందుకు సహేతుకమైన కారణాలతో ముందుకు వెళ్తారు. వీలైనంతవరకు పార్టీలోనే కొనసాగించేలా చూస్తారు. ఇప్పుడు జీవన్ రెడ్డి విషయంలో రేవంత్ రెడ్డి అనుసరించిన తీరు కూడా అదే. చివరి వరకు జీవన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో కొనసాగేలా ప్రయత్నాలు జరుగుతాయి. అవి శృతి మించి జీవన్ రెడ్డి వెళ్లి పోతే మాత్రం ఆ తప్పు తన పై పడకుండా చూసుకుంటారు రేవంత్. చంద్రబాబు ఫార్ములా కూడా అదే.

### అప్పట్లో కేశినేని విషయంలో..

2024 సార్వత్రిక ఎన్నికల కు ముందు విజయవాడ ఎంపీగా ఉన్న కేశినేని నాని ఇదే మాదిరిగా పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయేందుకు సిద్ధపడ్డారు. ఆ సమయంలో కూడా చంద్రబాబు తరుపున కొంతమంది నేతలు మధ్యవర్తిత్వం వహించారు. చంద్రబాబు ఒకరిద్దరూ నేతలను పంపించి కేసినేని నానితో మాట్లాడించారు. అయితే చంద్రబాబు ఇక్కడే ఒక జాగ్రత్త తీసుకుంటారు. వెళ్లిపోయే వారికి ఎటువంటి హామీలు ఇవ్వరు. తన మాటగా మాత్రమే చెప్పాలని చెబుతారు. అవతలి వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే తీసుకుంటారు. ఇప్పుడు జీవన్ రెడ్డి విషయంలో కూడా రేవంత్ అలానే వ్యవహరించినట్లు తెలుస్తోంది. కేవలం జీవన్ రెడ్డి అభిప్రాయాన్ని మాత్రమే తీసుకున్నట్లు సమాచారం.

### ప్రాధాన్యం ఇవ్వాలని..

గులాబీ పార్టీని దెబ్బతీయాలన్న లక్ష్యంతో చాలామంది ఎమ్మెల్యేలను ఆకర్షించింది కాంగ్రెస్ పార్టీ. అలా జీవన్ రెడ్డి పై గెలిచిన సంజయ్ ను కాంగ్రెస్ పార్టీలోకి తెచ్చుకుంది. ఆయనకు ప్రాధాన్యమిస్తోంది. అయితే నాపై గెలవవచ్చు కానీ.. అంతకుముందు గెలిచిన వ్యక్తిని నేను అంటూ జీవన్ రెడ్డి వాదిస్తున్నారు. నా ప్రమేయం లేకుండా పార్టీలో తీసుకోవడమే కాదు ప్రాధాన్యం ఇవ్వడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు పార్టీ దూతల వద్ద కూడా అదే ప్రస్తావన చేశారు. తనకు ప్రాధాన్యం ఇస్తేనే అంటూ నిబంధన విధించారు. దానికి కట్టుబడి ఉంటేనే కాంగ్రెస్లో కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే ఇప్పుడు బంతి కాంగ్రెస్ హై కమాండ్ కోర్టులో ఉంది. అన్నింటికీ మించి సీఎం రేవంత్ రెడ్డి పరిధిలో ఉంది. ఆయన తీసుకునే నిర్ణయం మేరకు మాత్రమే జీవన్ రెడ్డి కాంగ్రెస్ లో ఉంటారా? గులాబీ పార్టీలో చేరుతారా అనేది తేలనుంది.

# మరో వివాదంతో గరికపాటి!

(మొదటి పేజీ తరువాయి)

గరికపాటి నరసింహారావు. అయితే ఆయన తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. తన వ్యాఖ్యలతో అడ్డంగా బుక్ అవుతున్నారు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ ఉపాధ్యాయుల విధులపై ఆయన చేసిన కామెంట్స్ వివాదానికి కారణం అవుతున్నాయి.

### యధాలపంగా వ్యాఖ్యలు..

తాజాగా ఆయన ఓ ప్రవచనంలో భాగంగా మధ్యాహ్న భోజన పథకం తో పాటు చదువులపై మాట్లాడారు. పిల్లాడికి మంచి చదువు ఇవ్వాలి కానీ.. మధ్యాహ్నం భోజనం పెట్టడం ఏంటని... ఆ భోజనంలో కోడి గుడ్డు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. పిల్లాడిని శోభనం పెళ్ళికొడుకు గా మార్చుతున్నారు అంటూ ఎద్దేవా చేశారు. చదువు చెప్పాల్సిన వారు లెక్కలు చేయాల్సి వస్తోందని ప్రభుత్వ ఉపాధ్యాయుల విధులపై మాట్లాడారు. వారు పాఠాలు బోధించడం కంటే.. బయట పనులు ఎక్కువ చేస్తున్నారు అంటూ వారిపై అదనపు భారం విధుల గురించి మాట్లాడారు. అయితే సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇప్పుడు నెటిజెన్లకు టార్గెట్ అవుతున్నారు గరికపాటి. అనవసర



వివాదంలో చిక్కుకున్నారు. అయితే ఆయన అటువంటి వ్యాఖ్యలు చేయలేదని.. ఆయన మాటలకు సంబంధించి క్లిప్పులను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పెట్టారని ఆయన బృందం చెబుతోంది. దీంతో ఇది ఒక కొత్త వివాదానికి దారి తీసింది.

### గతంలో మెగాస్టార్ విషయంలో..

గతంలో కూడా మెగాస్టార్ చిరంజీవి విషయంలో గరికపాటి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో విమర్శలకు దారితీసాయి. ఓ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆ కార్యక్రమంలో గరికపాటి నరసింహారావు ప్రవచనం చేశారు. అయితే చిరంజీవిని చూసిన మహిళలతో పాటు అక్కడ ఉన్నవారు ఆయనతో ఫోటోలు దిగేందుకు ఎగబడ్డారు. వారి విన్నపాన్ని కాదనలేక వారితో ఫోటోలు దిగారు చిరంజీవి. దీంతో అవధాని గరికపాటికి ఒక్కసారిగా కోపం వచ్చింది. చిరంజీవి గారు ఫోటో సెషన్స్ ఆపండి. లేకుంటే ప్రవచనం ఆపేస్తా అంటూ అప్పట్లో గరికపాటి చాలా తక్కువ చేసి చిరంజీవి విషయంలో మాట్లాడారు. అప్పట్లో గరికపాటి తీరుపై మెగా ఫాన్స్ ఓ స్థాయిలో విరుచుకుపడ్డారు. మెగా బ్రదర్ నాగబాబు సైతం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అయితే తరువాత చిరంజీవి హుందాగా వ్యవహరించి ఆ వ్యవహారాన్ని ముగింపు పలికారు. అయితే ఇప్పుడు మరోసారి గరికపాటి అటువంటి వ్యాఖ్యానాలు చేయడంతో ఆయనపై ఓ రేంజ్ లో ఫైర్ అవుతున్నారు నెటిజన్లు. సోషల్ మీడియా అంతా ఇప్పుడు గరికపాటికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులతో దర్శనం ఇస్తోంది. మొత్తానికైతే గరికపాటి అనవసర విభాగాన్ని తన తలపైకి ఎత్తుకున్నట్లు అయ్యింది.

# హిప్పో దాడిలో పశువైద్యురాలు మృతి

### ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి

### ప్రభుత్వం తరఫున 30లక్షల పరిహారం ప్రకటన

బెంగళూరు,మార్చి21(ఆర్ఎన్ఎ): కర్ణాటకలో పెను విషాద ఘటన ఒకటి చోటుచేసుకుంది. హిప్పోపోటమస్ దాడిలో పశు వైద్యురాలు ప్రాణాలు కోల్పోయింది. గర్భంతో ఉన్న హిప్పోను చెక్ చేయడానికి వెళ్లిన సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన 27 ఏళ్ల సమీక్షా రెడ్డి త్యావరకొప్ప టైగర్, లయన్ సఫారీలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశువైద్యురాలిగా సేవలు అందిస్తోంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆమె జూలోని సన్ కాపర్ పక్షికి చికిత్స చేయడానికి వెళ్లింది. పక్షికి చికిత్స పూర్తయిన తర్వాత గర్భంతో ఉన్న హిప్పో టెంపరేచర్ చేయడానికి ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ హిప్పో ఆమెపై దాడి చేసింది. తలతో బలంగా సమీక్షారెడ్డిని కొట్టింది. దీంతో ఆమె ఊపిరితిత్తులు, లివర్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూ సిబ్బంది ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సమీక్షా రెడ్డి ప్రాణాలు విడిచింది. పశు వైద్యురాలి మృతిపై కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బీ ఖండ్రే స్పందించారు. సమీక్షారెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫు నుంచి 30 లక్షల రూపాయల పరిహారం ప్రకటించారు. ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. కాగా, సమీక్షా రెడ్డి హెబ్బల్‌లోని వెటర్నరీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. 2023లో డిగ్రీ పూర్తి అయిన తర్వాత కొంతకాలం పాటు మంగళూరు సర్కిల్ వైల్డ్ లైఫ్ డాక్టర్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేసింది. ఫిబ్రవరి నెల నుంచి శివమొగ్గ జూలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశువైద్యురాలిగా సేవలు అందిస్తున్నారు. జూలో విధుల్లో చేరి రెండు నెలలు కాకుండానే ఈ విషాదం చోటుచేసుకుంది.

## సైబర్ వలలో మాజీ డీజీపీ మనుమరాలు

ఈ నెల 13న బాధితురాలి ఫోటో డీపీగా ఉన్న నంబర్ నుంచి కంపెనీ అకౌంటెంట్ వాట్సాప్‌కు సందేశం వచ్చింది. తాను ముఖ్యమైన సమావేశంలో ఉన్నానని, తాను చెప్పిన ఖాతాకు వెంటనే రూ.1.20 కోట్లు బదిలీ చేయాలని అందులో ఉంది. మెసేజ్ తమ డైరెక్టర్ నుంచి వచ్చిందని భావించిన సదరు అకౌంటెంట్ వెంటనే రూ.1.20కోట్లు బదిలీ చేశాడు. అనంతరం, మరోసారి డబ్బు పంపాలంటూ అదే నంబర్ నుంచి మార్చి 17న మళ్లీ మెసేజ్ వచ్చింది. అయితే, డైరెక్టర్ కార్యాలయంలోనే ఉండడంతో చెక్ అప్రూవల్ కోసం అకౌంటెంట్ ఆమెను నేరుగా సంప్రదించారు. ఈ సందర్భంగా రూ.1.20 కోట్ల విషయం ప్రస్తావించగా.. తాను ఎలాంటి మెసేజ్ పంపలేదని బాధితురాలు చెప్పారు. దీంతో అకౌంటెంట్ తనకు వచ్చిన మెసేజ్, లావాదేవీ వివరాలను చూపించారు. అయితే, సైబర్ మోసాన్ని గుర్తించిన బాధితురాలు వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సీపీ సజ్జనార్ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు.

## ఐటి రంగంలో భారీగా తగ్గిన ఉద్యోగాలు

### ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కెటిఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గుదలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయామని అన్నారు. 2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట మార్చి 16న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని చెప్పారు. అనంతరం బ్జడెట్ ప్రవేశపెడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని తెలిపారు.ఐటీ సెక్టార్‌లో గణనీయంగా ఉద్యోగాల తగ్గుదలపై వారం వ్యవధిలోనే ప్రభుత్వం రెండు సార్లు అంగీకరించడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. ఐటీ రంగంలో ఈ ఉద్యోగాల తగ్గుదలకు కృత్రిమ మేధస్సు కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

### అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు



**రంగారెడ్డి, (క్రైమ్ మిర్రర్):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఫీఫీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ౼ూజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.



# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం



ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు.సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిడుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

# కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ అనే వ్యక్తి అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పాడైన, నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఊఈం÷ అధికారులు కేసు నమోదు చేసి అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో కుల్సుంపురా ప్రాంతంలో తయారవుతున్న ఫుడ్ ఐటమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండలని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్న ఆహారం కనపడుతుంది. హైదరాబాద్ ఫుడ్ అడల్టేష్రన్ సర్వేలేన్స్ టీం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కులసుంపుర పోలీస్ సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. అతనికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ÷ర్ సేఫ్టీ క్లియరెన్స్ ఏదీ లేకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో సమోసాలు, ఇతర ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దాడి సమయంలో సుమారు రూ.5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్

వాషింగ్టన్,మార్చి21: యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణ్రా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు.

## ఎడిటోరియల్



తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్‌పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల

# పరిషత్ లు రద్దు దిశగా అడుగులు

వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది.రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగావచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్టు స్పష్టం చేసింది. పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్క-సారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాతర విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్‌ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఫామ్‌హౌస్ నుంచి పాలన చేయడం తప్పని, జాతీయ పార్టీ నాయకత్వానికి కలవడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ దిల్లీలో పార్టీ కార్యాలయం ఎందుకు నిర్మించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో అత్యధికం ఇప్పటికే అమలు చేస్తున్నామని, కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసి పోయే రకం కాదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మార్చి రెండో వారానికిల్లా నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలను కూడా అదే గడువులోగా భర్తీ చేస్తామని మహేష్ కుమారు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేయడం వల్లే స్థానిక సంస్థల్లో మంచి ఫలితాలు వచ్చాయని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వివరించారు.

## ఆధార్ కార్డు కాదు..
## ఇకపై ఇది ఉంటేనే మహిళలకు ఫ్రీ బస్సు..!

మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ఆర్టీసీ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అర్హులకే ప్రయోజనం అందేలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు, ఇతర రాష్ట్రాల మహిళల వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి నగరంలో విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో సుమారు 3,200 బస్సులు నడుస్తుండగా, అందులో దాదాపు 2 వేల ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణికుల్లో దాదాపు 2 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో కూడా 90 శాతానికి చేరింది.అయితే, ఇటీవల ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. సుమారు 25 నుంచి 30 వేల వరకు అనుమానాస్పద ప్రయాణాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ కార్డు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్ కార్డులను చిప్ ఆధారిత టెక్నాలజీతో రూపొందించనున్నారు. కార్డులో లబ్ధిదారుల పేరు, చిరునామా, ప్రత్యేక ఐడీ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపిస్తే టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు, కొత్త విధానంలో స్మార్ట్ కార్డును టికెట్ ఇష్యూయింగ్ మెషీన్‌తో స్వైప్ చేస్తారు. వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. దీంతో ప్రయాణ ధృవీకరణ మరింత పారదర్శకంగా ఉంటుంది. ఆధార్ కార్డులను ప్రతిసారి వెంట తీసుకెళ్లాల్సిన ఇబ్బంది తగ్గడంతో పాటు, అర్హులైన మహిళలకు సౌకర్యవంతమైన విధానం అమల్లోకి రానుంది. స్మార్ట్ కార్డు జారీ విధానం, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.



# బాలికలకు శాపం.. ముందస్తు రుతుక్రమం

**ముం**దుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసం వాతావరణంలో మార్పులు, పోషకాహార లేమి తో చిన్న వయస్సులో రుతుక్రమం ఆడపిల్ల జీవితంలో 'రుతుక్రమం (రజస్వల)' కీలకమైన ఘట్టం. శారీర కంగా, మానసికంగా పలుమార్పులు చోటుచేసుకునే సహజ సందర్భం. హార్మోన్ల స్థాయిల్లో హెచ్చుతగ్గు లవల్ల కలిగే ఈ ప్రక్రియ, సాధారణంగా 13 15 ఏళ్ల వయస్సుమధ్యలో చోటుచేసుకుంటుంది. యవ్వనం లోకి అడుగిడుతున్న ఆడపిల్లలో రుతుక్రమం మొదలవుతుంది. ఈస్ట్రాజన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల మార్పుల వల్ల అండాశయంనుంచి అండం విడుదలకావడంతో ఈ ప్రక్రియ ఆరంభమవుతుంది. ఇది స్త్రీ పునరుత్పత్తి ఆరోగ్యానికి, శారీరక ఎదుగుదలకు, గర్భధారణ సామర్థ్యానికి సంకేతంలా నిలుస్తుంది. కానీ, వాతావరణంలో మార్పులు, పోషకాహార లేమి తదితర కారణాల వల్ల చిన్న వయస్సులోనే రుతుక్రమం గురవుతున్న బాలికల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో పిల్లలతోపాటు తల్లిదండ్రులు మానసిక క్షభకు గురవుతున్నారు. ఎదిగీఎదగని వయస్సు, ఆడుతూపాడుతూ గడిపే కాలం, ప్రాథమిక తరగతి చదువుతున్న క్రమంలో (అంటే 9..11 ఏళ్ల వయస్సు) రుతుక్రమం (ఎర్లియర్లీ మెచ్యూర్) చోటుచేసుకుంటోంది. ఆహారపు అలవాట్లు మారడం, అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తీసుకునే ఆహారంలో ఐరన్ లోపించడం, బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ) అనూహ్యంగా పెరిగి హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడంతో చిన్నవయస్సులోనే రుతుక్రమం చోటుచేసుకుంటోంది. హోమ్ అప్లయెన్సెస్ ఊహతెలియని వయస్సులో పిరియడ్ సైకిల్ ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. చిన్నారులకు అవగాహన కల్పించినా ఏమేరకు నెట్టుకురాగలు గుతారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి, రుతుక్రమం యవ్వనానికి చేరువవుతోన్న అమ్మాయిల్లో శారీరకంగా, మానసికంగా పలు మార్పులు రావడం సహజం. హార్మోన్ల స్థాయిలో హెచ్చుతగ్గులవల్ల వచ్చే ఈ మార్పులు టీనేజీ దశలో ప్రవేశించి అమ్మాయిలకు అసౌకర్యం, ఇబ్బందిని కలుగజేస్తున్నాయి. పైగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముంది. ముఖ్యంగా మెటబాలిక్ సింద్రోమ్, టైప్2 మధుమేహం, హైపర్ టెన్షన్ వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. రుతుక్రమం అయిన తొలి ఐదారేళ్ల వరకు నాణ్యమైన అండాలు ఉత్పత్తి అయినప్పటికీ, చివరి పదేళ్లలో అండాల ఉత్పత్తిలో నాణ్యత తగ్గడం, ఆలస్యంగా వివాహం చేసుకోవడం వల్ల సంతానోత్పత్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రతి బాలిక తన జీవితకాలంలో ఒక నిర్దిష్ట వయస్సులో రుతుక్రమం కావడం జరుగుతుంది. కొంతమందిలో కొంతమంది బాలికలు ఐదేళ్ల వయస్సులోనే రుతుక్రమంకు గురవుతున్నట్లు తేలింది. ఇందుకు ఆర్థిక అంశాలు మాత్రమే కాకుండా శారీరక అంశాలు, వాతావరణ పరిస్థితులు, పుట్టిన శిశువు తీసుకునే మందులు ప్రభావితం చేస్తున్నట్లు తేల్చారు. యాంటీబయోటిక్స్ ఒక కారణంగా దక్షిణ కొరియాలో జరిగిన ఓ అధ్యయనం తెలియజేస్తోంది. రెండు లక్షలమంది ఆడపిల్లలపై జరిపిన ఈ అధ్యయనం.. పుట్టిన పిల్లల దగ్గర్నుంచీ తొమ్మిదేళ్ల వయస్సు వరకూ గమనించారు. పుట్టిన తొలి మూడు నెలల్లో యాంటీబయోటిక్స్ తీసుకున్న ఆడశిశువుల్లో 22% మంది ఎనిమిదేళ్లకంటే ముందుగానే రుతుక్రమం అవుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితిని సిపిపి (సెంట్రల్ ప్రికాషియస్ ప్యుబర్టీ) అంటారు. పుట్టిన తొలి రెండు వారాల్లో యాంటీ బయోటిక్స్ ఇస్తే ఈ సమస్య తీవ్రంగా ఉంటుందంటున్నారు. శరీరంలోకి చేరిన యాంటీ బయోటిక్స్ ఆడపిల్లల హార్మోన్ల వ్యవస్థని అదుపు తప్పేలా చేయడం వల్లనే త్వరగా రుతుక్రమం అవుతుందని ఈ అధ్యయనం తెలియజేస్తున్నది. అధిక బరువు, ఊబకాయం, శారీరక శ్రమ తక్కువగా ఉండడం కారణమవుతున్నాయి. మొబైల్, టివిలను ఎక్కువ సమయం వీక్షించే బాలికల్లో యుక్తవయస్సు త్వరగా ప్రారంభమవుతుందని, ఇవి తమ మొదటి పీరియడ్స్‌ను ప్రేరేపిస్తుందని వివరించారు. బాలికల్లో ఎర్లీ పీరియడ్స్‌కు పరిసర ప్రాంతాలు కూడా ఓ కారణంగా నిలుస్తుందని పరిశోధకులు పన్నెండేళ్ల వయస్సు దాటినప్పటికీ రుతుక్రమం కోసం ఎదురుచూస్తుంటారు. గతంలో పదహారేళ్ల వయస్సులో రుతుక్రమం అయ్యేది. తర్వాత కాలంలో చాలా మంది అమ్మాయిలు 12 15 ఏళ్ల వయస్సులో రుతుక్రమం జరుగుతుండేది. ప్రస్తుత కాలంలో బాలికలు తమ మొదటి పీరియడ్‌ను చాలా ముందుగానే పొందుతున్నారు. ముందుతరం వారితో పోలిస్తే ఐదేళ్ల వ్యత్యాసముంటోంది. సాధారణంగా బాల్యం చివరి దశలో ప్రారంభమయ్యే ప్రక్రియ ఇది. యుక్త వయస్సు రావడానికి ముందు హైపోథలమస్, పిట్యూటరీ, అండాశయాలు పరిపక్వ స్థితికి చేరుకుంటాయి. పదేళ్ల వయస్సులో మొదలైన ప్రక్రియ రెండు మూడేళ్లు కొనసాగి అప్పుడు రుతుక్రమంకు దారితీసేది. ప్రస్తుతం ఇందుకు భిన్నంగా పదేళ్ల కన్నా తక్కువ వయస్సులో రుతుక్రమం రావడం అసాధారణ సందర్భంగానే వైద్యులు పేర్కొంటున్నారు.చిన్న వయస్సులో రుతుక్రమం రావడానికి దారితీస్తున్న పరిస్థితులపై ప్రపంచవ్యాప్తంగా పలు పరిశోధనలు జరుగుతున్నాయి. ఆర్థిక నేపథ్యం నుంచి ప్రతి అంశం వారిని ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి..భట్రాజులంటే చులకనేందుకు

**ముఖ్యమంత్రి భట్రాజు సంఘంపై చేసిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలి**

**భట్రాజు కులస్తుల ఆగ్రహ జ్వాలలు**

**పండిత విద్వాంసులపై మీ ప్రతాపం ఎందుకు..?**

**రాజకీయాల్లో చరిత్ర మార్చేది బీసీలే**

**బీసీ ఆట్రాసిటీ చట్టం అమలు లోకి రావాలి**

**భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు**



**కూకట్ పల్లి, మార్చి 21 (క్రైమ్ మిర్రర్) :** పండిత విద్వాంసులుగా నాటి రాజుల కాలం నుండి ఎంతో ప్రత్యేక స్థానంలో ఉంటూ చరిత్ర ఉన్న భట్రాజు కులస్తులు పవిత్రమైన పండితులుగా, ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ నాటి నుండి నేటి వరకు ఎంతోమంది నిరక్షరాసులకు విద్యాబుద్ధులు నేర్పి సన్మార్గంలో నడిపించిన తమ కులస్తులను కించపరిచే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈనెల 19 న బిఆర్ఎస్ పాలన ను ఎండగట్టే క్రమంలో తమ కులస్తులను అవహేళన చేస్తూ కించపరిచే విధంగా మాట్లాడడం అహంకారపూరితమైన పాలనకు నిదర్శనమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర భట్రాజ సంఘం అధికార ప్రతినిధి బొల్లెపల్లి సీతారామరాజు, సంఘ పెద్దలు, కులస్తులు అభివర్ణించారు. సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం ఒక ప్రైవేట్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కుల పెద్దలతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 70 వేల మంది పైచిలుకు తమ భట్రాజు కులస్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా సీఎం.మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. తమ కులస్తులంటే అంత చిన్నచూపు ఎందుకని, మీ ఫలాలు ఏమైనా గుంజుకున్నామా అని సూటిగా ప్రశ్నించారు. బీసీ లపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తూ ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని కాంగ్రెస్ పాలకుల తీరును ఎండగట్టారు. లైకులు కొడితే పది రూపాయలు, కామెంట్లు పెడితే వంద రూపాయలు, ప్రచారానికి వెళ్తే వెయ్యి అని.. ఆహోరాజా...ఓహోరాజా.. అంటుంటారని అంటూ తమ వ్యక్తిత్వాలను కించపరిచే విధంగా సీఎం.మాట్లాడడం ఎంతవరకు సమంజసమని వ్యాఖ్యానించారు. రెడ్డి ల కులస్తులను గూర్చి బీసీ బిడ్డలమైన మేము ఎక్కడ తక్కువ చేసి మాట్లాడిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. మీకు ఓట్లు వేసి గెలిపిస్తే మా భట్రాజు కులస్తులను ఇంత అవమానపరుస్తారా..ఇది సబబు కాదని, యాస, భాషా రెండు మార్చుకొని సీఎం పద్ధతి ప్రకారంగా మాట్లాడాలని పునరుద్ఘాటించారు. సీఎం.అనుచిత వ్యాఖ్యలను శాసనమండలిలో భట్రాజు కులస్తుల ఆత్మ గౌరవాన్ని పెంచే విధంగా మాట్లాడాలని తెలంగాణ రాష్ట్ర రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కు వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతికి కృషి చేస్తూ అండగా నిలబడతానని మల్లన్న హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ఆట్రాసిటి తరహాలో బీసీ అట్రాసిటీ కూడా అమలయ్యే విధంగా చట్టం రూపొందించాలన్నారు. సీఎం మాటలను వెనక్కు తీసుకొని వెంటనే క్షమాపణలు చెప్పాలని కులస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కలిసిన వారిలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అంబటి బాపిరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి రాజు, యువ నాయకులు గాదెరాజు విజయ్, మేడ్చల్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి రాజు, శ్రీరామ్, కూరపాటి తదితరులు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** రంజాన్ పండుగ సందర్భంగా చిట్యాల లో ఈద్గా వద్ద ముస్లిం సోదరులను కలిసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన పోకల దేవదాస్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మరియు కాంగ్రెస్ నాయకులు పందిరి రమేష్, చేపూరి యాదయ్య,ఎద్దుల పూరి కృష్ణ ,గుండెబోయిన సైదులు,కోనేటి ఎల్లయ్య, జేరిపోతుల సత్యనారాయణ,దేశపాక రాజేష్, సిలువేరు శేఖర్, దామనూరి అశోక్ ,బూరుగు కృష్ణయ్య,కొసనం అశోక్,ఏనుగు నరసింహారెడ్డి, ,దాసరి నరసింహ తదితరులు పాల్గొన్నారు

## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న హరికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కొరికి ఎమ్మెల్యే డాక్టర్ టి రాంమ్మోహన్ రెడ్డి శనివారం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోనీ అన్ని మండల కేంద్రాలలో అలాగే పరిగి పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు,పండుగ సంబరాల్లో పాల్గొని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రంజాన్ పండుగ శాంతి, సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు.అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.





## బునాదిగాని చెరువును పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలోని బునాదిగాని చెరువులోకి గోదావరి జలాలు వచ్చి చెరువు నిండుకుండలా మారడంతో ఆ యొక్క ప్రదేశాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గోదావరి జలాల నీరు రావడం జరిగిందని,ఈ ప్రాంత రైతులందరూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ,హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి మాజీ ఎంపీటీసీ మల్లేశం, కందులశ్రీనివాస్,ఈతాప రాములు,జాంగిర్ శంకర్,సురేష్,తదితరు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ శాంతి,సహనం కి ప్రతీక గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్ ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రంజాన్ పండుగ శాంతి, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు.గ్రామంలో అన్ని మతాల ప్రజలు ఐక్యంగా జీవించడం గర్వకారణమని అన్నారు.ఈ పండుగ సందర్భంగా స్నేహభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు.సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని కోరుకున్నారు.ముస్లిం సోదరులు చేపట్టే ఉపవాస దీక్షలు మనకు మంచి విలువలను నేర్పిస్తాయని తెలిపారు.అందరూ పరస్పరం గౌరవించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి సర్పంచ్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుంజీ రాజు వార్డు సభ్యులు లాడే అనిత కూడా హాజరయ్యారు. శ్రీనివాస్, లడే రాములు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పండుగ సందడి గ్రామంలో కనిపించింది. అందరూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామంలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది. సమాజ ఐక్యతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొండి చేయి

**విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**

**ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ సర్కారు**

**ఎస్ఎఫ్ఐ పరిగి డివిజన్ అధ్యక్షులు గుర్రంపల్లి శివశంకర్ ,కార్యదర్శి ఎండి కలిమ్.**



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొండీ చెయ్యి చూపించిందని ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పరిగి డివిజన్ అధ్యక్షుడు శివ శంకర్ మాట్లాడుతూ,ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో భారీ హామీలు, గొప్ప పదజాలం వినిపించినా, క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపలేదని మండిపడింది.బడ్జెట్ ప్రసంగంలో "నాణ్యమైన విద్య", "అంతర్జాతీయ ప్రమాణాలు", "డిజిటల్ అభివృద్ధి" వంటి పదజాలంతో మాయాజాలం సృష్టించిన ప్రభుత్వం, వాస్తవంగా మాత్రం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎస్ఎఫ్ఐ పేర్కొంది. మొత్తం రూ.3,24,234 కోట్ల బడ్జెట్ విద్యకు కేవలం రూ.26,674 కోట్లు (8.22%) మాత్రమే కేటాయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరిగి డివిజన్ ఎండి.సమీర్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.


## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ముజాహిద్పూర్ గ్రామ పెద్దలు



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ముస్లిం సోదరులకు ముజాహిద్ పూర్ గ్రామ నాయకులు శనివారం వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి అలై బలై కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు అలింగనము చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ అనేది త్యాగం నియమం సహనం దానధర్మాలకు ప్రతికగా నిలిచే పవిత్రమైన మాసమని, ఈ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసము ద్వారా మనసును పవిత్రం చేసుకోవడం పేదల పట్ల దయ చూపించడం ఐక్యతను పెంపొందించడం అంటే ప్రధాన లక్షణం అని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో ముజాహిద్పూర్ గ్రామ మాజీ సర్పంచ్ పడగల లక్ష్మీ ఆనంద్, హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సైని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ వెంకటయ్య పటాన్చెరువు తాండా గ్రామ సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్, మత్స్యకారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షులు కోమాల అనంతయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# టీవీఏఈ జెఏసి సమ్మెను జయప్రదం చేయండి

## వికారాబాద్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల హెచ్ 82 యూనియన్ ప్రధాన కార్యదర్శి శివ్వని వెంకటయ్య

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** టీవీ ఏఈ జేఏసీ సమ్మెను జయప్రదం చేయాలని వికారాబాద్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల హెచ్ 82 యూనియన్ ప్రధాన కార్యదర్శి శివ్వని వెంకటయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న సుమారు 23 వేల మంది ఆర్టిజన్ కార్మికులకు ఏపిఎస్ ఈబి రూల్స్ వర్తింప చేయాలని విద్యా అర్హతలు బట్టి కన్వర్షన్ ఇవ్వాలని, కార్మికుందరికీ విద్యుత్ శాఖలో ఒకే సంస్థ ఒకే రూల్స్ ఉంటుంది కానీ మన విద్యుత్ శాఖలో మాత్రం చట్టానికి విరుద్ధంగా రెండు రూల్స్ ప్రైవేటు సెక్టార్ లో ఉన్నటువంటి 1947 ఆనాటి బ్రిటిష్ కాలం నాటి చట్టం స్టాండింగ్ ఆర్డర్ అమలు చేసి సుమారు 8 సంవత్సరాలు గడుస్తున్నద వారు అన్నారు. ఈ ఆర్టిజన్ కార్మికులు సుమారు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి మాత్రం సపరేట్ గా స్టాండింగ్ ఆర్డర్స్ రూల్ పెట్టి కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తు ఎలాంటి ప్రమోషన్స్ ఇవ్వకుండా మేనేజ్మెంట్ మోసం చేస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులకు ఇంక్రిమెంటు 24 గంటల ఇంక్రిమెంట్ గాని అమలు చేయకుండా

శ్రమ దోపిడీకి గురిచేస్తూ చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా నష్టపోతున్నామని వారు తెలిపారు. కావున విద్యుత్ సంస్థ లో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే రూల్స్ అది అప్పెబ్ రూలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నోసార్లు యాజమాన్యానికి, ప్రభుత్వానికి నోటీస్ ఇవ్వడం జరిగిందని,అయినా కానీ ఇప్పటివరకు యాజమాన్యం ప్రభుత్వశీ స్పందించడం లేదు కావున ఏప్రిల్ 8 నాడు సమ్మెనిర్వహించుటకు,విద్యుత్ శాఖలో ఉన్నటువంటి 9ట్రేడ్ సంఘాలలో ఉన్న ఆర్టిజన్ కార్మికులు అందరూ కలిసి టీవీఏఈ జెఏసి గా ఏర్పడి, కార్మికుల సమస్యల మీద పోరాడాలని నిర్ణయించడం జరిగింది. అందులో భాగంగా టీవిఏఈ జేఏసీ సమ్మె కు పిలుపునివ్వడం జరిగింది. ఈ సమ్మె కు వికారాబాద్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని, అంతేకాకుండా పైన ఉన్న డిమాండ్స్ అమలు చేయని యెడల 8వ తారీకు నుంచి విధులు బహిష్కరించడం జరుగుతుందని,దానికి ఎలక్ట్రిక్ ఉద్యోగులందరూ సహకరించాలని పేర్కొన్నారు.



# ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లిం సోదరులు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి రాంపూర్ గ్రామంలో శనివారం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు అందరూ ఊరేగింపుగా నీద్గాకు వెళ్లి నమాజ్ ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఎంపీ రజాక్, ఎండి నసీం, చోటు బాయ్, మమ్మద్ కాజా మియా, గౌస్, బురాన్,అర్షద్, షకీల్, సోను, ఉస్మాన్, అస్లం, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది...ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన బండి రమేష్



**కూకట్ పల్లి, మార్చి 21 (క్రైమ్ మిర్రర్) :** రంజాన్ ముగింపు సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్ ఉత్సవాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. మూసాపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చున్ను పాషా ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మోసిన్, జాకీర్, తూము వేణు, తూము సంతోష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సప్పిడి భాస్కర్, పెంటయ్య, తూము వినయ్, కర్రెమ్మ, నారాయణ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# రానున్న శ్రీరామనవమి వేడుకలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలి

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**



**కూకట్ పల్లి, మార్చి 21 (క్రైమ్ మిర్రర్) :** ఈనెల 27 శ్రీరామ నవమి సందర్భంగా కూకట్ పల్లి రామాలయశీతో పాటు మిగిలిన ఆలయాల్లోనూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అధికారులకు సూచించారు. కూకట్ పల్లి గ్రామంలోని శ్రీ సీత రామచంద్రస్వామి దేవాలయం లో స్వామి వారిని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ దర్శనం చేసుకుని, వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. శ్రీ రామ నవమి రోజు జరగనున్న రాములవారి కళ్యాణం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై రమేష్ శనివారం కూకట్ పల్లి రామాలయంలో వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీస్, జిహెచ్ఎంసి అధికారులతోపాటు రామాలయం కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ శ్రీ రాముల వారి కళ్యాణం సందర్భంగా ఆలయాల్లో భక్తులు రద్దీని, వేసవిని దృష్టిలో ఉంచుకొని త్రాగునీరుతోపాటు అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలని సూచించారు. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని పోలీసు వారికి అటు అగ్నిమాపక శాఖ అధికారులతోనూ రమేష్ మాట్లాడారు. భోజనాల సమయంలో రద్దీ, తొక్కిసలాట లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు, గుడెపు నాగరాజు, లక్ష్మయ్య, కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, ఎం. శ్రీనివాసరావు, జి.నాగేశ్వర రావు, మేకల సుదర్శన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎందుకో గాని...!!

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 21(క్రైమ్ మిర్రర్):** ఎందుకో గాని ఎన్నికలు వస్తే చాలు ఏదో ఒకటి జరుగుతుంది ఎందుకు జరుగుతుందో ఎలా జరుగుతుందో తెలియదు కానీ ఇన్సిడెంట్ అయితే జరుగుతుంది ఏదో ఒక రకంగా ప్రమాద అంచుల్లోకి నెట్టబడుతుంది జన సమూహం బలి అవుతుంది అది యాదృచ్ఛికమా..!! ప్రమాదమా..!! అంతర్గతగా నడుస్తున్న ఉపాయమా..!! అర్థం కాని గందరగోళం దానికి తోడు సంక్షోభంలో పడుతున్న ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది అందులో భాగంగా మౌలిక సదుపాయాల అవసరాలు అమాంతం పెరుగుతాయి మళ్లీ ఆ సంక్షోభాన్ని చక్కదిద్దుతున్నట్టు రాజకీయ నాయకుల నాటకాలు కుట్రలు ఎత్తుగడలు పైఎత్తులు ఆపైన సానుభూతిని సృష్టించడం మళ్లీ ఓట్లు వేసేలా వ్యూహం రచించడం గద్దెనెక్కడము ఒకటి కాదు రెండు కాదు ఇలా దఫ్ఫాలు దఫ్ఫాలుగా జరుగుతూనే ఉంది గతాన్ని తిరిగి చూస్తే గాయమైన కావ్యాలు ఎన్నో కాటికి వెళ్లిన దేహాలు ఎన్నో ఇదే తంతు ఎందుకిలా అంటే సమాధానం మౌనం ఇవన్నీ జనాలు గమనిస్తున్నారా అనుకుంటే వాళ్లకు అంత తీర్కెక్కడిది అనిపిస్తుంది నిజమే పొద్దున లేస్తే నేటి తరం యువతరం, సమాజం మద్యం మత్తులో తుల్లుతున్నారు గంజాయి మత్తులో తేలుతున్నారు సోషల్ మీడియా రీల్స్ చూస్తూ సోమరులుగా తయారవుతున్నారు మరికొందరు ఈ గజిబిజి లైఫ్ లో సంసారం, పిల్లలు అంటూ బరువు బాధ్యతలు మోస్తున్నారు వర్క్ బిజీ లో ఉండి ఎవరేమైతే నాకేంటి ఎవరు ఎటు పోతే నాకేంటి అనే స్వార్థం మత్తులో బతుకుతున్నారు మరికొందరు మౌనం వహిస్తూ చోద్యం చూస్తున్నారు తిరిగి అడగలేని ప్రశ్నించలేని పిరికితనంతో జీవిస్తున్నారు మరికొందరు మతం, కులం అంటూ మూఢనమ్మకాల మీద ఆధారపడుతూ భక్తి పరవశంతో ఊగిపోతూ తనకు తానుగా మోసం చేసుకుంటున్నారు నిజమేదో అబద్ధం ఏదో తెలుసుకోలేని పరిస్థితి ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో ఆందోళనలో పడుతున్న జనం. జనాన్ని మభ్యపెడుతున్న రాజకీయ తంత్రం జపిస్తున్న జనం ఇవన్నీ ఏటి కోసమంటే ఓట్ల కోసమేనని చెప్పకనే చెప్పొచ్చు ఓట్ల రాజకీయమే నని తెలిసి తెలిసి బోర్ల పడడమని చెప్పొచ్చు మళ్లీ మనమే పాలన పగ్గాలు పట్టొచ్చని మోసపూరిత ప్రణాళికలు ఇవన్నీ చూస్తూ కూడా ఏం పట్టనట్టు ఏమి గమనించినట్టు తీరిక లేనట్టు ఉన్నామా అంటే ఉన్నాము అన్నట్టుగా ఉన్నాము తిన్నావా పన్నామా తెల్లారిందా అనే



ఊహల్లో బతికేస్తూ ప్రపంచంతో సంబంధం లేదని బతుకుతున్నట్టుంది నేటి సమాజం పరిస్థితి. కాస్త ఆలోచిస్తే కాస్త గమనిస్తే వ్యత్యాసం తెలుస్తుంది లోతుగా పరిశీలిస్తే అర్థమవుతుంది అందుకే ఓ సమ సమాజమా మేలుకొని చూడు మేలిం బంగారం నువ్వే అవుతావు నిర్లక్ష్యం చేస్తే మొద్దు నిద్ర కూడా భయపెడుతుంది పురోగతి చేజారుతుంది అన్న సంగతి మర్చిపోవద్దు ఓ సమ సమాజమా..!!

**బాలు కత్తుల**



# మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ మరియు ఆర్థిక సహాయం

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 21:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో బోట్ల యాకుబ్ ప్రమాదంలో మరణించిన సందర్భంగా వారి కుటుంబాని పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత ఐలయ్య ఆధ్వర్యంలో ప్రగడ సామితి తెలియజేస్తూ వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేయడం జరిగింది. అలాగే టంగుటూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జుకంటి బాబు 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. అలాగే కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబానికి ఎప్పటికి అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టంగుటూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బండి శ్రీనివాసులు ఉపాధ్యక్షులు కల్లెపు నరేష్ మరియు వార్డు సభ్యులు కల్లెపూ సుభాష్ సీనియర్ కార్యకర్తలు మద్దూరి ఐలయ్య, బండి ఉమేష్, ఎలగందుల వెంకటయ్య, బండి కుమార్, జన్నె శ్రీనివాస్, కల్లెపు సుధీర్, ఎలగందుల వెంకటేష్, మామిడిల భారత్, జోగు ప్రసాద్ భూపెల్లి భాస్కర్,శగా వెంకటేష్, కల్లెపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో రంజాన్ వేడుకలు

**ముస్లిం సోదరీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్**

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి21:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ముస్లింలు రంజాన్ నెల రోజులు ఉపవాస దీక్ష ముగించుకొని శనివారం రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగ జరుపుకున్నారు. ముస్లిం సోదర సోదరీమణులందరికీ ప్రతి సంవత్సరం ఇలాగే సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఆ అల్లా మీకు మనందరికీ ఆత్మకూరు గ్రామానికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ఇవ్వాలని అల్లాని భక్తి శ్రద్ధలతో ప్రార్థించీ ముస్లిం సోదరీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్.





# ఘనంగా పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కాలనీవాసులు, మిత్రులు**

**కూకట్ పల్లి, మార్చి 21 (క్రైమ్ మిర్రర్) :** వెంకటేశ్వర నగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు పాపిరెడ్డి నగర్ లో గల రెడ్డి సంక్షేమ సంఘం లో అంగరంగ వైభవంగా జరిగింది. చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి జన్మదినం సందర్భంగా పాపిరెడ్డి నగర్ నుండి, ఇతర కాలనీవాసులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానించి శ్రీధర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి 121 డివిజన్ మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి శ్రీధర్ రెడ్డిచే కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి, కూకట్ పల్లి నియోజక వర్గ డివిజన్ సీనియర్ నాయకులు, ఇతర కార్మిక సంఘాల సీనియర్ నాయకులు, మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 22-3-2026


# రంజాన్ ను ముస్లిం సోదర సోదరీమణులందరు ఆనందంగా జరుపుకోవాలి

## రంజాన్ ప్రార్థనలలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి, మార్చి 21 (క్రైమ్ మిర్రర్) :** పవిత్ర రంజాన్ పండుగ పర్వదిన శుభసందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తా ఖాజా నగర్ లోని ఈద్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమానికి డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ విచ్చేసి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ఈద్గా వేలమంది ముస్లిం సోదరులు ఒకేచోట ప్రార్థనలు చేసుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉందని, ఈద్గా అభివృద్ధికి మీ అందరితో పాటు ముందుండి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రంజాన్ మాసం చాలా పవిత్రమైనది అని, రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దట్టైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సహనాన్ని, దానదయా గుణాన్ని, సోదరభావాన్ని, శాంతి సామరస్యాలను పెంపొందించే పవిత్ర పర్వదినం రంజాన్ ను ముస్లిం సోదర సోదరీమణులందరు ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ అందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు పట్వారి శశిధర్, గోపాల్, నీరుడి రాజు, గుడ్ల శ్రీనివాస్, లింగం, సుధాకర్, మోజెస్, బుల్లెట్ రవి తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి పరిరక్షణే పరమధర్మం
## ప్రపంచ కవిత్వ దినోత్సవం

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 21:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కవయిత్రి పత్తిపాటి మంజుల కలం నుంచి వేలువడిన కవిత.

వృక్షరాజుల వక్షస్థలమున్
వాయువు విహరించు వేళ,
మంజుల మానస సారమై
పత్తిపాటి పలుకు పరిమళించె;
ప్రకృతి పరిరక్షణే పరమధర్మం---
ప్రపంచ కవిత్వ దినోత్సవానికి
స్వాగతం పలుకుదాం రండీ॥
నీలాంబర తలపాగ మిద
నక్షత్ర హారముల కాంతి,
మంజుల కవిత్వ దీప్తిగా
పత్తిపాటి భావ రేఖలై మెరిసె;
భూమాత వేదన వినిపించున్---
ప్రపంచ కవిత్వ దినోత్సవానికి
స్వాగతం పలుకుదాం రండీ॥
సరిత్సాగర గర్భమున్
సంరక్షణ స్వరమెల్ల వినిపించగా,
మంజుల హృదయ తంత్రులపై
పత్తిపాటి రాగమాల విరిసె;
జలమే జీవన మూలమని---
ప్రపంచ కవిత్వ దినోత్సవానికి
స్వాగతం పలుకుదాం రండీ॥
పుష్పిత వనరాజుల లోకమున్
పక్షి గానామృతమెల్ల పారగా,
మంజుల సుగుణ సాన్నిధ్యమై
పత్తిపాటి పద్య కుసుమముల విరిసె;ప్రకృతి లాలనలోనే శాంతి--- ప్రపంచ కవిత్వ దినోత్సవానికి
స్వాగతం పలుకుదాం రండీ॥
భూమండల మాతృమూర్తి
బాధతో మౌనమై నిలిచిన వేళ,
మంజుల కరుణారస గంభీరమై
పత్తిపాటి వాక్యామృతమై పొంగె;
మనసారా కాపాడుదాం భూదేవిని---
ప్రపంచ కవిత్వ దినోత్సవానికి
స్వాగతం పలుకుదాం రండీ॥
అంటున్న కవయిత్రి మంజుల.

# ఆచార్యదేవోభవ అనే నినాదంతో మల్లపురం యువత



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 21:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో కుంచం నర్సింహులు దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలుపుతూ పూర్వ విద్యార్థులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.గురు బ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వర గురు సాక్షా పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః అనే పద్యానికి మల్లాపురం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయునికి శుభాకాంక్షలు తెలిపి వారు చెప్పిన విద్యా బోధనలు జీవితంలో ఉపయోగపడుతున్నాయని గుర్తుచేసుకొని కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణేష్ యూత్ ప్రెసిడెంట్ శిఖ రమేష్ గౌడ్,బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ ఇండ్ల ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండం కనకరాజు గౌడ్ ,రజక సంఘ నాయకులు కొమరాజు భరత్, స్థానిక వార్డు సభ్యులు కర్రె చంద్రశేఖర్, పాల్గొన్నారు.

# బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం



**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 21:** భద్రాచలం ఐటిడిఏ రోడ్డులో గల ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా ఘనంగా "ఉగాది కవి సమ్మేళనం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సాహిత్య వేడుకలో అనేకమంది కవులు పాల్గొని తమ హృదయ స్పందనలను కవితల రూపంలో ఆవిష్కరించారు. కవుల కవిత్వ మాధుర్యం, భావాల లోతు సభను ఆత్మీయ వాతావరణంతో నింపాయి. ప్రతి కవిత ప్రేక్షకుల హృదయాలను హత్తుకుని, సాహిత్య సుగంధంతో కార్యక్రమాన్ని అలంకరించింది. ఈ కార్యక్రమంలో సరస్వతి దేవి వేషధారణలో ఒక చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వేదికకు ఆధ్యాత్మిక కాంతిని చేకూర్చింది. ఆమె రూపం సభలో ఉన్న అందరికీ దివ్యానుభూతిని కలిగించింది.ఇక ప్రకృతి కూడా ఈ సాహిత్య వేడుకకు స్పందించినట్లు, కురిసిన సీతకోకచిలుకల వంటి జల్లులు సభను మరింత మధురంగా మార్చాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు బి కే . కృష్ణవేణి మాట్లాడుతూ, సాహిత్యం మనసులను కలిపే మహత్తర శక్తి అని, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మంచి విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నేడు అనేక సమస్యలతో, చింతలతో సతమతమవుతున్న మానవ మనసులకు శాంతినిచ్చి సన్మార్గం చూపించే బాట రాజయోగమని ప్రతి ఒక్కరూ జీవితంలో తప్పకుండా ఇది నేర్చుకోవాలని సూచించారు.. సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు---మెమరీ పవర్ అభివృద్ధి, పరీక్షల భయం నివారణ, మానసిక ఒత్తిడి నివారణ పద్ధతులు, విలువల ఆధారిత జీవన విధానం వంటి అంశాలపై ప్రజలు ప్రయోజనం పొందాలని ఆహ్వానించారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కవులు, పాల్గొన్న అతిథులకు నిర్వాహకులు సన్మానం చేసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పండుగలను కలిసిమెలిసి జరుపుకోవాలి

## సర్పంచ్, శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్‌యాదవ్





**గండిపేట(క్రైం మిర్రర్) :** పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని సర్పంచ్, శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. నర్కుడ గ్రమంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, త్యాగం, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఈ పండుగ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పీటీసీ నీరటి తన్విరాజు, ఉపసర్పంచ్ నీరటి మహేష మాజీ ఎంపీటీసీలు తొంట అశోక్, శ్రీనివాస్, వార్డు సభ్యులు, నర్కుడ కాంగ్రెస్‌పార్టీ గ్రామ అధ్యక్షులు చౌట శేఖర్, సీనియర్ నాయకులు నీరటి కృష్ణ, గుండాల విశ్వన్యాద్, టి.కుమార్, శివాజీ, అశోక్, వినోద్, సాయినాథ్, ప్రభు, సందీప్, శ్రీనాథ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# సోదరభావాన్ని, శాంతి సామరస్యాలను పెంపొందించే పవిత్ర పర్వదినం రంజాన్

## శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు

**కూకట్ పల్లి, మార్చి 21 (క్రైమ్ మిర్రర్) :** పవిత్ర మాసం రంజాన్ అని సోదర భావాన్ని శాంతి సామరస్యాలను పెంపొందింప చేస్తుందని శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు అన్నారు.పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు షంషీగూడ లోని ఈద్గా మైదానం లో జరిగిన నమాజ్ ప్రార్థనలలో (ఈద్ నమాజ్) పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈద్గా ప్రెసిడెంట్ సమ్మాద్, సెక్రటెరి షౌకత్ అలీ మున్నా, కాజ మియా, షేక్ కాజా, ఎండీ గౌస్, షఫీ, ఇస్మాయిల్, మైనారిటీ మత పెద్దలు, ముస్లిమ్ సోదరులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా గణేష్ నేత



**కూకట్ పల్లి, మార్చి 21 (క్రైమ్ మిర్రర్) :** శేర్లింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ శంశిగుడా ప్రాంతంలో గల ముస్లిం మైనారిటీ సోదరులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత కలిసి ఈద్ ఉల్ పితర్ రంజాన్ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ మైనారిటీ సోదరులు వారి కుటుంబ సభ్యులతో కలిసి అత్యంత పవిత్రంగా భావించే ఈ రంజాన్ నెల మొతం భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్ష నిర్వహిస్తూ వారి అల్లను వేసుకోవడం జరుతుందన్నారు. ఈ శుభసందర్భంలో రంజాన్ నెల పూర్తి చేసుకొని ఒకరిని ఒకరు కలుసుకొని ఈద్ ముబారక్ చెప్పుకోవడం అనవహితి కనుక నేను ఈ రోజు పలువురి మైనారిటీ సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలపడం జరిగింది అని వారు అన్నారు.

# పండుగ సందర్భంగా ముస్లింలను ఆలింగనం చేసిన సిద్ధార్థ



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 21:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్ధార్థ శనివారం మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ, అవంతిపురం ఈద్గాలను సందర్శించారు. ఈద్గా వద్ద నమాజ్ ముగించుకొని బయటకు వస్తున్న ముస్లింలను సాదరంగా ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నల్లమోతు సిద్ధార్థ మాట్లాడుతూ గంగా..జమునా తెహజీబ్‌కు ప్రతీకగా మిర్యాలగూడలో అన్ని మతాల ప్రజలు సోదరభావంతో జీవించడం ఆనందకరమని అన్నారు. రంజాన్ పర్వదినం ప్రతి ఇంట్లో సుఖశాంతులు, ఆనందాలు నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అన్నభీమోజు నాగార్జునచారి, ఎం.డి. మగ్దుం పాషా, ఎం.డి. ఇలియాస్ ఖాన్, ఎం.డి. మజీద్, ఎం.డి. షోయబ్, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు పూనాటి లక్ష్మీనారాయణ, గుడిసె దుర్గాప్రసాద్, సుధాకర్, భూక్య రాంబాబు, సందేశి అంజన్ రాజు, రామావత్ చంటి నాయక్, తిరుపతినాయుడు, తిరుమలగిరి వజ్రం, వడ్డేపల్లి శ్రీనివాస్, జన్నపాల కిరణ్, మన్నెం శ్రీనివాసరెడ్డి, గంటా శ్రావణ్‌రెడ్డి, వల్లంపల్లి వినోద్‌కుమార్, గుడిగుంట్ల గణేష్‌కుమార్, తీరంశెట్టి కోటేశ్వరరావు, సాదినేని శ్రీనివాసరావు, షేక్ ఫయాజ్, లాలూనాయక్, పందిరి వేణు, తుమ్మల ఫణికుమార్, పరిమి రామావతారం, గంగుల బిక్షం యాదవ్, షేక్ మస్తాన్, చాంద్ పాషా, దైద సత్యం, ఎక్క మనిదీప్, ఆయిల్ శ్రీను, కోల రామస్వామి, గయాస్, ఆలిం, గోపి, పాషాభాయ్, చావుష్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 శనివారం 22-3-2026



## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 21:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎస్కే చాంద్ నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అందరూ ఆరోగ్యంగా ఉండాలని అల్లాను ప్రార్థించారు.

## ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో రంజాన్ వేడుకలు స్వీట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 21:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో శనివారం రంజాన్ పర్వదినం వేడుకలు వైభవంగా జరిగాయి. రంజాన్ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముస్లింములతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేసిన తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అందరు సోదరభావంతో ప్రతి సంవత్సరం కలిసి మెలిసి పండుగలను జరుపుకోవాలని ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి నియోజకవర్గ ప్రజలందరూ తోడ్పాటును అందించాలనీ కోరారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై ఆరోపణలు మానుకోవాలి




మునుగోడు క్రైమ్ మిర్రర్: మునుగోడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చూస్తున్నారని చండూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ ధోటీ నారాయణ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి,మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ పేర్కొన్నారు...మునుగోడు నియోజకవర్గంలో కంటి సమస్యతో ఏ ఒక్కరు కూడా బాధపడొద్దు అన్న ఉద్దేశ్యంతో తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదల కండ్లల్లో వెలుగులు నింపుతున్నారని గుర్తుకు తెచ్చారు. 10 సంవత్సరాల టిఆర్ ఎస్ పాలనలో ఏమి చేశారని ప్రశ్నించారు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు..వివిధ గ్రామాల సర్పంచులు,నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 21:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో శనివారం రోజున స్థానిక ఈద్గాలో (ఈద్–ఉల్–ఫితర్)రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం రంజాన్ పండుగ శుభాకాంక్షలు ఒకరికొకరు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో, సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు, ముస్లిం సోదరులు ఎండీ యూసఫ్, యూనస్, శానూర్,రఫీ, ఆఫ్జల్, కరీం,తదితరులు పాల్గొన్నారు.



# పేద ముస్లిం ఒంటరి మహిళకి స్వంత నిధులతో ఇల్లు నిర్మించి ఇచ్చిన డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

### నా లాంటి పేదోళ్లకి పెద్ద కొడుకు అయి అండగా నిలుస్తున్న ర్యాకల శ్రీనివాస్ కి జీవింతాంతం రుణపడి ఉంటానన్న అమీనా బీ

### గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన నా వంతు సహాయ సహకారాలు అందిస్తా ఆర్ ఎస్ కే ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చ్ 21:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్పూర్ గ్రామానికి చెందిన పేద ముస్లిం ఒంటరి మహిళ అయిన షేక్ అమీనా బి చాలా రోజులుగా ఉండడానికి ఏ విధమైన ఆవాసం లేక చాలా ఇబ్బంది పడుతుంటే ఆమె పరిస్థితి చూసి ఆమెకోసం గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ తమ ఆర్ ఎస్ కె ఫౌండేషన్ ద్వారా స్వంత ఖర్చులతో సామాజిక వేత్త , డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటిని నిర్మించి ఇచ్చారు. నిర్మించి ఇచ్చిన ఇంటిని రంజాన్ పర్వదినం సందర్భంగా వారితో కలిసి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా నా సహాయ సహకారాలు ఉంటాయని,గ్రామ ప్రజల శ్రేయస్సే తన ముఖ్య కార్యాచరణ అని వారు హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణం అనంతరం రంజాన్ పండుగ సందర్భంగా గృహ ప్రవేశం చేసిన అమీనా బీ ఎంతో సంతోషంగా నా పెద్ద కొడుకు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అని ఆయన కుటుంబం మొత్తం అల్లా దయతో



సంతోషంగా ఉండాలని దివించారు . నా లాంటి పేదోళ్లకి పెద్ద కొడుకు అయి అండగా నిలుస్తున్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఈకార్యక్రమంలో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామక్రిష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజ్, బీట్కూరి మహేష్, ఓరుగంటి మానస నాగరాజు, స్థానిక వార్డు సభ్యులు షేక్ అహ్మద్, గ్రామ పెద్దలు, యువకులు, మైనారిటీ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలతో కలిసి రంజాన్ నమాజ్ చేసిన ఎమ్మెల్యే బీఎల్ఆర్





**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 21: :** ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) పర్వదినం సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ముస్లిం సోదరులతో కలిసి పట్టణంలోని బంగారుగడ్డ ఈద్గాహ్‌లో ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం మిర్యాలగూడ మండలం అవంతిపురం ఈద్గాహ్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్ ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ శాంతి, సౌహార్దానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహబూబ్ అలీ, డి. స్కైల్యాబ్ నాయక్, ఎండి. జానీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాయం ఉపేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి నవీన్ పాల్గొన్నారు. అదేవిధంగా కౌన్సిలర్లు ఎండి. మొయిజ్, షేక్ అబ్దుల్లా, ఎండి. ఫారుక్, ఎండి. అయూబ్, గిరిధర్, బూడిద సైదులు,మనోజ్‌తో పాటు పట్టణ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపం

### పట్టించుకోకపోవడంతో నాసిరకంగా పనులు

### నామమాత్రం పనులు చేసి చేతులు దులుపుకుంటున్న కాంట్రాక్టర్లు

గండిపేట(క్రైం మిర్రర్) : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో అవి నాలుగు రోజులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. ఏదో చేశాము అన్నట్లు చేసి అధికారులు తమ చేతులను దులుపుకోని వెళ్లిపోతున్నారు. తర్వాత ప్రజలు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లాల్‌బహదూర్ నగర్ రోడ్డులో డ్రైనేజీ పైపులైన్ వేసి నామమాత్రంగా పైనపైన ప్యాచ్‌వర్క్‌లు నిర్వహించారు. ప్రజలంతా పడుకున్న తరువాత రాత్రి 2 గంటల ప్రాంతంలో ఎవరు చూడని సమయంలో ఈ నామమాత్ర పనులు చేసి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని జాగాలలో పైపులైన్ వేసిన గానీ ప్యాచ్‌వర్క్ చేయడం లేదని కాలనీల వాసులు తెలుపుతున్నారు. ప్యాచ్‌వర్క్‌లో కాంక్రెట్, సిమెంట్‌లో నాణ్యత లేదని కొన్ని ప్లేసెస్‌లో ఒక ఇంచ్ మాల్ కూడా పూర్తి చేయడం లేదని వెల్లడిస్తున్నారు. నామమాత్రంగా చేస్తున్న పనులు ఎవరికి ఉపయోగపడవని స్థానికులు వెల్లడిస్తున్నారు. 2--3 రోజుల్లోనే అవి పూర్తిగా పాడైపోయి ప్రజలకు మరింత ఇబ్బందులు సృష్టిస్తు మొదటికే వస్తాయని వెల్లడిస్తున్నారు. అధికారులు అభివృద్ధి పనులు నిర్వహించే సమయంలో ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.





అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే నాసీరకంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి స్థానికులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అబివృద్ధి పనులపై పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వివేక్

**మందమర్రి టౌన్ మార్చ్ 21 క్రైమ్ మిర్రర్:** రంజాన్ పండుగ ను పురస్కరించుకొని మందమర్రి విద్యానగర్, సీఈఆర్ క్లబ్ సమీపంలోనీ ఈద్గా ల వద్ద ముస్లిం సోదరులను కలసి కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నింపాలని, సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. గంగ జమున తహసివ్ లాగా చెన్నూరు నియోజక వర్గంలో ముస్లిం సోదరులు పాటిస్తారు. ప్రేమ అనురాగాలు,మానవత్వం తో ప్రజలందరూ ఉన్నప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. మందమర్రి లో 50 లక్షలతో షాదిఖానా,ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసేందుకు పనులను త్వరలోనే ప్రారంభిస్తా అన్నారు. సింగరేణి సంస్థ తో మాట్లాడి ఈద్గా వద్ద కమాన్ ఏర్పాటు చేపిస్తానని తెలియజేశారు.



# ఆహార భద్రత నమోదు మేళా ఘన విజయం

## చిన్న వ్యాపారులకు అవగాహన, నమోదు సౌకర్యం






**గండిపేట్ :( క్రైమ్ మిర్రర్ ):** 99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం పదహారవ రోజు సందర్భంగా ఆహార భద్రత నమోదు మేళా నిర్వహించారు. అత్తాపూర్ సర్కిల్ కార్యాలయం, జీహెచ్ఎంసీ పరిధిలోని బుద్వేల్, రాజేంద్రనగర్ ప్రాంతంలో జరిగిన ఈ మేళాకు చిన్న చిన్న ఆహార పదార్థాలు అమ్మే వ్యాపారులు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీధి వ్యాపారులు, చిన్న హోటల్ యజమానులు, టిఫిన్ సెంటర్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, నిర్వాహకులు, ఆహార స్టాళ్ల యజమానులు తమ వ్యాపారాలకు సంబంధించిన ఆహార భద్రత నమోదు (ఎఫ్ఎస్ఎస్ఏఐ నమోదు)ను సులభంగా చేసుకునే విధంగా అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అధికారులు వారికి అవసరమైన పత్రాలు, నమోదు విధానం గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ మేళాను డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మరియు ఆహార భద్రత అధికారి సౌమ్య రెడ్డి ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఆహార వ్యాపారి తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ నమోదు చేసుకోవాలని, ప్రజలకు నాణ్యమైన మరియు సురక్షిత ఆహారం అందించడం తమ బాధ్యతగా భావించాలని సూచించారు. అలాగే, నమోదు చేసుకోవడం వల్ల వ్యాపారులకు చట్టపరమైన రక్షణతో పాటు వినియోగదారుల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి మేళాలు చిన్న వ్యాపారులకు ఎంతో ఉపయోగపడతాయని, ఇంకా ఎక్కువ మంది వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది వ్యాపారులు నమోదు చేసుకుని, ఆహార భద్రత ప్రమాణాలపై అవగాహన పెంచుకున్నారు. స్థానికులు మరియు వ్యాపారులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇటువంటి మేళాలను మరింతగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పిలు హేమలత, గంజి నాగమణి, తదితరులు పాల్గొన్నారు......



## రాజేంద్రనగర్‌లో ఆహార భద్రత నమోదు మేళా విజయవంతం

### -చిన్న వ్యాపారులకు అవగాహన

**గండిపేట్ :( క్రైమ్ మిర్రర్ ):** 99 రోజుల ప్రజా పాలన -- పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 16వ శనివారం ఆహార భద్రత నమోదు మేళా (ఎఫ్ఎస్సెస్ఐ) విజయవంతంగా నిర్వహించారు.ఈ మేళాలో చిన్న స్థాయి ఆహార వ్యాపారులు పాల్గొని తమ వ్యాపారాలకు సంబంధించిన నమోదు ప్రక్రియలు పూర్తి చేసుకున్నారు. కార్యక్రమం రాజేంద్రనగర్ సర్కిల్-19, జీహెచ్ఎంసీ పరిధిలోని బండ్లగూడ జాగీర్ వద్ద ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, రజినికాంత్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో యూసీడీ బృందం కూడా పాల్గొని విజయవంతం చేసింది. మేళా ద్వారా ఆహార భద్రత ప్రమాణాలపై వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు, నమోదు ప్రక్రియను సులభతరం చేశారు.

## బైక్ యాక్సిడెంట్ ఇద్దరికీ గాయాలు

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** రెండు బైకులు ఎదురెదురుగా డికొనడం వలన ఇద్దరికీ గాయాలు అయిన ఘటన మునుగోడులో చోటుచేసుకుంది..వివరాల్లోకి వెళితే మునుగోడు మండలం దుబ్బకాలువ గ్రామానికి చెందిన డి శ్రీను 50 సంవత్సరములు మరియు బి పూర్ణ 30 సంవత్సరములు ఇద్దరూ ఇంటికి వెళ్లే క్రమములో లక్ష్మీదేవిగూడెం మార్గ మధ్యలో రెండు బైకులు ఢీకొనడం వలన గాయాలు అయ్యావి .స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించగా 108 సిబ్బంది ఈఎంటి గుంటి రమేష్ పైలట్ కె హృతిక్ ఘటన స్థలానికి చేరుకొని డి శ్రీను కు ప్రథమ చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం..



# సమైక్యతా సౌరభం.. రంజాన్ సంబరం!

## ముస్లిం సోదరులతో తుంబూరు దయాకర్ రెడ్డి ఆత్మీయ ఆలింగనం





**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి :** భారతీయ జీవన స్రవంతిలో అంతర్భాగమైన గంగా-జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా, మత సామరస్యానికి మకుటాయమానంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఏదులాపురం ప్రాంతంలో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సంక్షేమ పథకాలపై భరోసా**

ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ప్రభుత్వం మైనారిటీల పక్షపాతి. విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లిం సోదరులకు అండగా ఉంటూ, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మంత్రి పొంగులేటి లక్ష్యం" అని భరోసా ఇచ్చారు.

**ఆత్మీయ ఆతిథ్యం**

పండుగ వేళ ఆత్మీయతను చాటుతూ మద్దులపల్లిలోని ఎస్.కె. జానీ నివాసానికి, ఖమ్మం నగరంలోని సీనియర్ నాయకులు ఎస్.కె. ఇమామ్ భాయ్ గృహానికి వెళ్లిన దయాకర్ రెడ్డి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించి ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ వేడుకల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత


**మునుగోడు మార్చి 21:** మునుగోడు మండలం బట్ల కాల్వ గ్రామానికి చెందిన పులకరం వెంకన్న శుక్రవారం మరణించడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు రూ.10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు, ఈ కార్యక్రమంలో పాల్వాయి చెన్నారెడ్డి యసరాణి సైదులు నారగోని యాదయ్య నారగోని నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 23న మేజ్ జర్మ్‌ప్లాజం ఫీల్డ్ డే

**గండిపేట(క్రైం మిర్రర్) :** ఐసిఏఆర్--ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేజ్ రీసెర్చ్ (ఐసీఏఆర్--ఐఐఎంఆర్), లుధియానా వారు ఈ నెల 23న హైదరాబాద్‌లోని వింటర్ నర్సరీ కేంద్రంలో మేజ్ జర్మ్‌ప్లాజం ఫీల్డ్ డేను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా సుమారు 100 మంది మొక్కజొన్న శాస్త్రవేత్తలు పాల్గొని, భవిష్యత్తులో మక్కజొన్న మెరుగుదల కోసం వినియోగించేందుకు విభిన్న జర్మ్‌ప్లాజంను ఎంపిక చేయనున్నారు. మొక్కజొన్న భారతదేశంలో అత్యంత బహుముఖ వినియోగం కలిగిన పంటలలో ఒకటి ఇది ఆహారం, పశువుల మేత, గడ్డి, ఇంధనం, పారిశ్రామిక రంగాలలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశంలో సుమారు 12 మిలియన్ హెక్టార్లలో సాగు జరుగుతూ, ఉత్పత్తి 43.41 మిలియన్ టన్నుల వరకు చేరుకుందన్నారు. 2030 నాటికి సుమారు 70 మిలియన్ టన్నులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చేందుకు మొక్కజొన్న ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం అత్యవసరం, ముఖ్యంగా వివిధ పారిశ్రామిక అవసరాల కోసం ఈ నేపథ్యంలో విభిన్న జర్మ్‌ప్లాజం స్థిరమైన జన్యు మెరుగుదల, భవిష్యత్‌కు సిద్ధమైన హైబ్రిడ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ ఫీల్డ్ డే కార్యక్రమంలో ప్రముఖ నిపుణులు పాల్గొననున్నారన్నారు. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా మొక్కజొన్న పరిశోధనలో ప్రముఖుడైన సిఐఎంఎంవైటి గ్లోబల్ మేజ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డా. ఆశిష్ సక్సేనా, సిఐఎంఎంవైటి కంట్రీ ప్రతినిధి డా. మహేష్ గాథాలా పాల్గొని గ్లోబల్ మొక్కజొన్న మెరుగుదల, స్థిరమైన ఉత్పత్తి పెంపుపై వ్యూహాత్మక సూచనలు అందించనున్నారన్నారు.ఐసీఏఆర్--ఐఐఎంఆర్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ ఫీల్డ్ డే, జాతీయ జర్మ్‌ప్లాజం బేస్‌ను బలోపేతం చేయడానికి ఇది కీలక కార్యక్రమం దీని ద్వారా హెక్టారుకు 15 టన్నుల వరకు దిగుబడి సామర్థ్యం కలిగిన మరియు అధిక ఎథనాల్ కంటెంట్ ఉన్న మక్కజొన్న హైబ్రిడ్ల అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇది భారత ప్రభుత్వ ఈ30 మిషన్‌కు అనుగుణంగా, ఎథనాల్ మిశ్రమాన్ని పెంపొందించడం మరియు స్థిరమైన బయోఫ్యూయల్ ఉత్పత్తిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం శాస్త్రీయ పరస్పర మార్పిడికి ఒక చైతన్యవంతమైన వేదికగా నిలిచి, మొక్కజొన్న వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, జాతీయ, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆహారం, మేత, ఇంధన భద్రత కోసం తదుపరి తరం మొక్కజొన్న హైబ్రిడ్ల అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

## గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్తులు కావాలి

### ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** గ్రామాన్ని అభివృద్ధి పరచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులను నాయకులతో కలిసి శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుచుకోవాలంటే ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వడ్డే లక్ష్మి వెంకటయ్య, రాంపూర్ గ్రామ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కురుంపల్లి నర్సింలు, వార్డ్ మెంబర్లు వెన్నచేటి అంజిలయ్య, ఎర్రం లక్ష్మీనరసింహులు, రాంపూర్ మాజీ ఎంపీటీసీ గండి లక్ష్మయ్య, మాజీ వార్డ్ మెంబర్ పోటీ శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పోటీ చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీల రాఘవేందర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలియజేసిన సల్ల రాజు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ గా నియమితులైన నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. సల్ల రాజు బేడ బుడగ జంగాల రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అనారోగ్యంతో శానిటరీ కార్మికుడు మృతి



గండిపేట(క్రైం మిర్రర్) : అత్తాపూర్ సర్కిల్ శానిటరీ కార్మికుడు కె.యాదయ్య ఆకస్మికంగా మరణించారు. ఆయన మరణంపై ఉపకమిషనర్ సమ్మయ్య ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి సానుభూతిని తెలిపారు. ఈ కఠిన సమయంలో వారికి పూర్తి మద్దతు అందిస్తామని లెలలిపారు. అంత్యక్రియల ఖర్చులకు సహాయంగా జీహెచ్ఎంసీ తరపున 20 వేల రూపాయల సహాయాన్ని అందించారు, అధికారులు జీహెచ్ఎంసీ తమ ప్రతి కార్మికుడిని కుటుంబ సభ్యులుగా భావిస్తుందని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. కార్మికుల సంక్షేమం , భ్రత పట్ల జీహెచ్ఎంసీ కట్టుబడి ఉంటుందని తెలిపారు.





# ఈద్గాహ్‌ల వద్ద వేలాదిగా ముస్లింల ప్రార్థనలు

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 21:** మిర్యాలగూడ డివిజన్‌లో రంజాన్ ఉపవాసాలు ముగించుకున్న ముస్లింలు శనివారం ఈదుల్ ఫిత్ర్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని బంగారుగడ్డ ఈద్గాహ్‌తో పాటు మండలంలోని టీక్యతండా, అవంతిపురం ఈద్గాహ్‌ల వద్ద వేలాది మంది ముస్లింలు ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. బంగారుగడ్డ ఈద్గాహ్‌లో మౌలానా వలియుల్లా, టీక్యతండాలో మౌలానా మగ్దుం అక్బర్ మోహియుద్దీన్, అవంతిపురం ఈద్గాహ్‌లో ముఫ్తీ ఇమ్రాన్ నమాజ్ నిర్వహించి ముస్లింలకు పర్వదిన సందేశం అందించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు నాగభూషణరావు, సోమనరసయ్య, ప్రసాద్ బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ముస్లిం సోదరులకు ఈదుల్ ఫిత్ర్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆటోచోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

### పోలీసులకు అప్పగించిన స్థానికులు

**గండిపేట(క్రైం మిర్రర్) :** వైన్స్ వద్ద పూటుగా మద్యం సేవించి ఆటో తస్కరించేందుకు యత్నించిన వ్యక్తిని స్థానికులు గుర్తించి దేహశుద్ధి చేశారు. అనంతరం స్తంభానికి కట్టి పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. వివరాల ప్రకారం హైదర్‌గూడ కుల్‌దీప్ వైన్స్ వద్ద ఆటో చోరీ చేస్తుండా అక్కడే ఉన్న స్థానికులు చూసి పట్టుకున్నారు. ఆటో చోరీ చేసుకోని నార్సింగిలోని ఒక ఆటో మొదటిగా అక్కడ పెట్టి మరో ఆటోకు చోరీకి పాల్పడుతున్న సమయంలో స్థానికులు చూసి పట్టకోని చితకబాదారు. వెంటనే లలీసులకు సమాచారం అందజేయగా ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఛలో హైదరాబాద్ ఇందిరా పార్కు విజయవతం చేయాలి: వనంపల్లి జైపాల్‌రెడ్డి





**గండిపేట(క్రైం మిర్రర్) :** తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి శనివారం అత్తాపూర్ సిర్కల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని కార్మికులతో సమావేశం నిర్వహించారు. కాటేదాన్ ప్రాంతంలోని రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి కార్మికులకు ఈ నెల 23వ తేదీన ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టించుకోవాలని, మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని అనేకమైటువంటి సమస్యల మీద జరగబోయే ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ మండల అ్యధ్యక్ష, కార్యదర్శులు సాయిలు, టి.ఆనంద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమాఏశం నిర్వహించారు. ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఏ.రాజు, శ్రీను, రాజు, సంతోష్, లక్ష్మమ్మ, మంగమ్మ, శంకరమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# RKS ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్!





**నల్లగొండ, క్రైమ్ మిర్రర్:** RKS ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ 10వ డివిజన్ లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్, 10 విడిజన్ కార్పొరేటర్ పిల్లి కృష్ణం రాజు యాదవ్ నేతృత్వంలో హైదరాబాద్ మలక్ పేట యశోద హాస్పిటల్ వైద్యుల బృందం ఈ హెల్త్ క్యాంప్ ను నిర్వహించింది. ప్రేరణ స్కూల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్డియాలజిస్టు, గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్ నిపుణులు పాల్గొని ప్రజలను పరీక్షించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు.

**ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే మెడికల్ క్యాంప్ ఏర్పాటు**

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ మెగా హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేసినట్లు RKS ఫౌండేషన్ నిర్వాహకులు పిల్లి రామరాజు, పిల్లి కృష్ణం రాజు వెల్లడించారు. ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ఇప్పటికే నల్లగొండలు పలు మెగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. తాజాగా ప్రేరణ స్కూల్ లో మలక్ పేట యశోద ఆస్పత్రి సహకారంతో మరోసారి మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజలకు గుండె జబ్బుల నుంచి మొదలుకొని అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందించినట్లు చెప్పారు. ఈ హెల్త్ క్యాంప్ నకు సహకరించిన యశోద హాస్పిటల్ యాజమాన్యానికి, క్యాంపునకు వచ్చిన డాక్టర్ల బృందానికి, ఈ క్యాంప్ స్కూల్లో ఏర్పాటు చేసుకునేందుకు సహకరించిన ప్రేరణ స్కూల్ యాజమాన్యానికి, ఈ కార్యక్రమం సక్సెస్ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి పిల్లి బ్రదర్స్ ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిల్లి రామరాజు యాదవ్, పిల్లి కృష్ణం రాజు యాదవ్ తో పాటు ప్రేరణ స్కూల్ ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి, బానోతు రవిందర్, గంగబోయిన వెంకన్న, వెంకటాచారి, నామా ప్రకాష్, పుల్లెంల మహేష్ గౌడ్, మామిడాల కృష్ణ, పెరికెటి వెంకటేశ్వర్లు, ఐతరాజు జానయ్య, జ్యోతి, సింగం రమేష్, యశోద డాక్టర్లు, ప్రేరణ స్కూల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో 10వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక

**రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి**





**గండిపేట(క్రైం మిర్రర్) :** రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైనార్టీ మోర్చా డివిజన్ అధ్యక్షులు మదర్‌భాయ్ నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మైనార్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలకు ప్రజలందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన రంజాన్ నెలలో మనసును పవిత్రం చేసుకోవడానికి ఉపవాస దీక్షలు ప్రార్థనలు చేసి పేదలకు దానాలు చేసి పరస్పర ప్రేమభిమానాలు పొందిన ముస్లిం సోదర సోదరీమణులను కలుసుకొని రంజాన్ శుభాకాంక్షలు తన మనసుకు ఆంగ్లం కలిగించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మైనార్టీ మోర్చా అధ్యక్షులు మజర్ భాయ్, జబ్బర్, సీనియర్ నాయకులు రావుల భాస్కర్, మాజీ డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, ప్రభుదాస్, మహ్మద్ షాల్, శ్రీకాంత్‌రెడ్డి, అబూత్ జుబేర్‌ఖాన్, ముస్తఫా, మధుసూధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# మూసి సుందరీకరణపై మధు పార్క్ వాసుల ఆందోళన -- రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగింపు





**గండిపేట్ క్రైమ్ మిర్రర్:** మూసి సుందరీకరణ ప్రాజెక్ట్ నేపథ్యంలో మధు పార్క్ అపార్ట్మెంట్ వాసుల ఆందోళన రోజురోజుకీ ఉధృతమవుతోంది. తమ నివాసాలను ప్రభుత్వం కూల్చివేయనున్నదన్న ఆందోళనతో నిన్న ప్రారంభించిన రిలే నిరాహార దీక్ష ఈరోజు రెండవ రోజుకు చేరుకొని కొనసాగుతోంది. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ వాసులు మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో తమ ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నివాసాలను యథాతథంగా ఉంచి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో మూసి సుందరీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలు, యువత సహా పెద్ద సంఖ్యలో అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ హక్కులను పరిరక్షించాలని, జీవన భద్రత కల్పించాలని నినాదాలు చేశారు..ప్రజల జీవన హక్కులను కాపాడే దిశగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, బాధితులతో చర్చలు జరిపి తక్షణ పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. రేపు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులు, బాధితులతో కలిసి భారీ స్థాయిలో నిరాహార దీక్ష నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యకు న్యాయం చేయాలని మధు పార్క్ అపార్ట్మెంట్ వాసులు కోరుతున్నారు.

GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.